మరమ్మతులకు నోచుకోని ఈత కొలను!

- అకాల వర్షానికి ధ్వంసమైన ఈత కొలను ప్రాంగణం
- రూ.5 లక్షలకు పైగా నష్టం

అకాల వర్షాలకు ధ్వంసమైన ఈత కొలను నేటికీ మరమ్మతులకు నోచుకోలేదు. జిల్లాలో స్విమ్మర్లకు శిక్షణ అందిస్తున్న ముఖ్యమైన ఈత కొలను అభివృద్ధికి ఎదురుచూస్తోంది. నిధులు మంజూరులో తలెత్తుతున్న జాప్యం కారణంగా మౌలిక వసతుల కల్పన, మరమ్మతులకు మోక్షం లభించడంలేదు. దీంతో శిక్షణకు వచ్చే స్విమ్మర్లు స్వల్ప అసౌకర్యానికి గురవుతున్నారు.

కంకిపాడు: కృష్ణాజిల్లా క్రీడా ప్రాధికారసంస్థ ఆధ్వర్యంలో మచిలీపట్నం తరువాత నడిచే ముఖ్యమైన స్విమ్మింగ్ పూల్ ఈడుపుగల్లులో ఉంది. సుమారు దశాబ్ద కాలంగా ఇక్కడి ఔత్సాహికులు స్విమ్మింగ్‌లో శిక్షణ పొందుతున్నారు. విజయవాడ పరిసర ప్రాంతాల నుంచి సైతం స్విమ్మర్లు, ఔత్సాహికులు స్థానికం స్విమ్మింగ్ పూల్‌లో శిక్షణ తీసుకుంటున్నారు. కృష్ణాజిల్లాలోని పలు మండలాలతో పాటు ఎన్టీఆర్ జిల్లా విజయవాడ పరిసరాల నుంచి కూడా పిల్లలు, పెద్దలు ఇక్కడ ఈతలో మెళకువలు నేర్చుకునేలా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అవసరమైన చర్యలు తీసుకుంటోంది.

అకాల వర్షంతో నష్టం..

ఈ ఏడాది మే నెలలో కురిసిన అకాల వర్షాలతో స్విమ్మింగ్ పూల్‌కు భారీ స్థాయిలో నష్టం ఏర్పడింది. ఈడుపుగల్లు పరిధిలో వీచిన ఈదురుగాలులకు స్విమ్మింగ్ పూల్ సమీపంలో భారీ వృక్షాలు నేలకూలాయి. స్విమ్మింగ్ పూల్ ప్రధాన గేట్లు ధ్వంసమయ్యాయి. వాటర్ ట్యాంకు దెబ్బతింది. ప్రహరీ గోడకు చుట్టూ అమర్చిన రేకులు నేలవాలాయి. పడమర వైపున ఉన్న రేకులు ఎప్పుడు పడిపోతాయో అర్థం కాని పరిస్థితి నెలకొంది. దీంతో కొద్దిరోజులు పాటు తాత్కాలికంగా ఈత కొలనును మూసివేసి చిన్న చిన్న మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తెచ్చారు.

నిధుల మంజూరుకు ఎదురుచూపులు..

భారీ వర్షంతో ఈత కొలనుకు జరిగిన నష్టంపై జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు అంచనాలు రూపొందించారు. రూ.5 లక్షలకు పైగా నిధులు అవసరం ఉందని అప్పట్లో అధికారులు ఉన్నతాధికారులకు నివేదించారు. ఈ మేరకు నష్టంపై ప్రాథమిక సమాచారాన్ని జిల్లా కలెక్టరుకు సమర్పించారు. కాగా ఆరు నెలలు గడుస్తున్నా నేటికీ ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదు. దీంతో ఈత కొలను అభివృద్ధి అంశం ఎక్కడి గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. దీంతో కూటమి ప్రభుత్వం క్రీడల ప్రోత్సాహం విషయంలో అలసత్వం ప్రదర్శిస్తుందన్న వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి.





జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈడుపుగల్లు స్విమ్మింగ్ పూల్ ధ్వంసమైన ప్రహరీ రేకులు(ఫైల్)

నిధులు మంజూరైతే పనులు చేపడతాం..

భారీ వర్షాలతో ఈత కొలను పూర్తిగా దెబ్బతింది. ప్రాథమికంగా అంచనాలను రూపొందించి కలెక్టర్‌కు నివేదిక పంపాము. పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈత నేర్చుకునేందుకు వచ్చే స్విమ్మర్లకు అసౌకర్యం కలుగకుండా అన్ని చర్యలూ చేపట్టాం. నిధులు మంజూరు కాగానే అవసరమైన మరమ్మతులు పూర్తి చేస్తాం.

– ఝాన్సీ, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి, కృష్ణాజిల్లా

క్లుప్తంగా

చంద్రబాబు కుట్రను తిప్పికొడతాం

పెనమలూరు: రాష్ట్రంలో నకిలీ మద్యం వ్యవహారం నుంచి బయట పడడానికి చంద్రబాబు నాయుడు చేస్తున్న కుట్రను తిప్పికొడతామని పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ బీసీసెల్ అధ్యక్షుడు మండూరు కోటేశ్వరరావు తెలిపారు. జగనన్న పాలనలో మద్యం అమ్మకాలు తగ్గించాలని మద్యాన్ని ప్రభుత్వ షాపుల ద్వారా విక్రయించారన్నారు. కాగా సీఎం చంద్రబాబు తన అనుకూల సిండికేట్లకు మద్యం దందా అప్పగించారని విమర్శించారు. బీసీనేత జోగి రమేష్‌పై ఎమ్మెల్యే బోడెప్రసాద్ చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. బోడె ప్రసాద్‌కు బీసీలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

స్వచ్ఛరథం ప్రారంభం



పెనమలూరు: మండల పరిధిలో ఆరు గ్రామ పంచాయతీలకు సంబంధించి స్వచ్ఛ రథాన్ని పెనమలూరు ఎమ్మెల్యే బోడెప్రసాద్ ప్రారంభించారు. గంగూరు గ్రామంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తమ ఇళ్లల్లోని నిరుపయోగంగా ఉన్న వస్తువులు, ప్లాస్టిక్ వస్తువులు స్వచ్ఛ రథానికి అందిస్తే రోజువారి ఉపయోగించే వస్తువులు అందిస్తామన్నారు. దీని వల్ల ఇల్లు, పరిసరాలు శుభ్రంగా ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించి స్వచ్ఛ రథాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో డాక్టర్ బండి ప్రణవి, పెనమలూరు సర్పంచి లింగాల భాస్కరరావు, నాయకులు అక్బర్‌పాషా, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



రామవరప్పాడు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన తైక్వాండో పోటీల్లో ప్రసాదంపాడులోని సెయింట్ ఆన్స్ పాఠశాల విద్యార్థిని ఉత్తమ ప్రతిభ సాధించిందని పాఠశాల హెచ్‌ఎం సిస్టర్ అరుణమేరి తెలిపారు. పాఠశాలలో బుధవారం జిల్లా స్థాయిలో మొదటి స్థానం సాధించిన విద్యార్థిని శ్రీనిఖను అభినందించారు. అండర్-17 68 కేజీల విభాగంలో శ్రీనిఖ ఉత్తమ ప్రతిభ కనబరిచి మొదటి స్థానం సాధించిందని అరుణమేరి అన్నారు. రాష్ట్ర స్థాయిలో త్వరలో జరుగనున్న తైక్వాండో పోటీలకు విద్యార్థిని ఎంపికైయిందని తెలిపారు. ఈ సందర్భంగా కోచ్ అంకమ్మరావు, ఉపాధ్యాయులు శ్రీనిఖను అభినందించారు.

22 నుంచి కార్తిక పూజలు

గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో ఈనెల 22వ తేదీ నుంచి కార్తికమాసం పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల రోజుల పాటు రోజూ రాత్రి 7 గంటలకు శ్రీవిష్ణు సహస్ర నామ పారాయణం, కార్తిక పురాణం జరుగుతుందన్నారు. ఈనెల 31న అమ్మవారి సన్నిధిలో కోటి దీపోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నవంబరు 14వ తేదీన అమ్మవార్లకు గాజుల అలంకరణ జరుగుతుందన్నారు.

కొత్త ఉపాధ్యాయులకు సేవా పుస్తకాలు అందజేత



గన్నవరం: ఉంగుటూరు మండలంలో డీఎస్సీ-2025 ద్వారా ఎస్ఏలు, ఎస్జీటీలుగా నియమితులైన ఉపాధ్యాయులకు బుధవారం యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ఏడుగురు కొత్త ఉపాధ్యాయులకు యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సీతారామయ్య చేతుల మీదుగా సేవా పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కొత్తఉపాధ్యాయులకు విధి నిర్వాహణలో అవసరమైన సహకారాన్ని యూటీఎఫ్ అందజేస్తుందన్నారు. ఉంగుటూరు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం సీహెచ్ అనిత, పలువురు యూటీఎఫ్ సంఘ నాయకులు పాల్గొన్నారు.

స్వాములకు అన్నదానం

పెనమలూరు: పోరంకిలో అయ్యప్ప మాల వేసుకున్న స్వాములకు శివసతి చారిటబుల్ ట్రస్టు సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని గురుస్వామి బొర్రాకృష్ణ బుధవారం తెలిపారు. వచ్చే నెల 25వ తేదీ వరకు రోజూ అయ్యప్ప స్వాములకు తమ ఇంటి వద్ద అన్నదానం ఉంటుందన్నారు.

ఉచిత వైద్య శిబిరం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం కోడూరుపాడులో శ్రీసత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో సమితి జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, హనుమాన్‌జంక్షన్, కోడూరుపాడు, పెద్దవుటపల్లి కన్వీనర్లు బెక్కం వెంకటేశ్వరరావు, గరికపాటి రామకృష్ణ, కొండలరావు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహణపై శిక్షణ

ఉంగుటూరు(గన్నవరం): మండల కేంద్రమైన ఉంగుటూరు రైతు సేవా కేంద్రంలో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహణపై గ్రామ వ్యవసాయ సహాయకులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి జి.రమేష్ మాట్లాడుతూ.. కొన్ని రోజుల్లో వరి కోతలు, నూర్పిడిలు ప్రారంభంకానున్న దృష్ట్యా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు సిబ్బంది సమయత్తం కావాలని తెలిపారు. మండలంలో రైతుల నుంచి ధాన్యం సేకరించేందుకు 12 కొనుగోలు కేంద్రాలను కేటాయించినట్లు వివరించారు. ధాన్యం తేమ శాతం, రంగు మారిన ధాన్యం గుర్తించడం, ఆన్‌లైన్‌లో షెడ్యూలింగ్, ట్రక్ షీట్, మిల్లు వివరాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. పౌర సరఫరాల శాఖకు చెందిన భవితవ్య, ప్రీతి తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: రైతులు దళారుల బారిన పడకుండా తగిన గిట్టుబాటు ధరలు కల్పించేందుకు ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిబంధనల మేరకు నిర్వహించాలని బాపులపాడు మండల వ్యవసాయాధికారి రంగనాథ్ బాబు తెలిపారు. స్థానిక మహాత్మాగాంధీ నగర్‌లోని మండల పరిషత్ కార్యాలయం మీటింగ్ హాల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహణపై పీఏసీఎస్ కార్యదర్శులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్లు, డేటా ఎంటీ ఆపరేటర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. మండలంలో 15 ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లుగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారులు సి.చిన్నారి, పి.లేఖశ్రీ పలు అంశాలపై వివరంగా సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.



సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎంఏవో రమేష్

కుటీర పరిశ్రమగా నకిలీ మద్యం

పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవభక్తుని చక్రవర్తి

పెనమలూరు: నారావారి పాలనలో రాష్ట్రంలో నకిలీ మద్యం కుటీర పరిశ్రమలా మారిందని వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవభక్తుని చక్రవర్తి ఆరోపించారు. కానూరు పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో నకిలీ మద్యంపై చంద్రబాబు చేస్తున్న డైవర్షన్ పాలిటిక్స్‌పై ఆయన తీవ్రంగా ధ్వజమెత్తారు. తంబల్లపల్లి నియోజకవర్గ పరిధిలో నకిలీ మద్యం తయారు చేస్తున్న పరిశ్రమను ఎక్సైజ్ అధికారులు దాడి చేసి పట్టుకున్నారని.. ఈ వ్యవహారంలో టీడీపీ నాయకులు జయచంద్రారెడ్డితో పాటు అతని మిత్రుడు అద్దేపల్లి జనార్ధనరావు, ఇతర టీడీపీ నాయకులు పట్టుబడడంతో కూటమి ప్రభుత్వానికి దిక్కుతోచని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. దీంతో సీఎం చంద్రబాబు ప్రతిపక్ష నేతలకు టార్గెట్ చేసి బురదజల్లే పని మొదలుపెట్టారని విమర్శించారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడిన చంద్రబాబు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పెనమలూరు ఎమ్మెల్యే బోడెప్రసాద్ తన నోరు అదుపులో పెట్టుకోవాలని.. లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని దేవభక్తుని చక్రవర్తి హెచ్చరించారు. ఎమ్మెల్యే ప్రసాద్ మంగళవారం మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి, జోగి రమేష్‌లపై అభ్యంతరకరంగా మాట్లాడడాన్ని చక్రవర్తి ఖండించారు. సమావేశంలో పార్టీ నాయకులు పి.రాఘవరావు, జంపాన ఏడు కొండలు, షేక్.అహ్మద్ అష్రఫ్, భీమవరపు కోటిరెడ్డి, కాసాని ఫణి, మండూరు కోటేశ్వరరావు, కొండవీటి వెంకటసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చక్రవర్తి

వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా ఉంటా

కంకిపాడు: వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా ఉంటానని పార్టీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి అన్నారు. కంకిపాడులో పార్టీ నాయకులు వంగూరు ముసలయ్య కుటుంబాన్ని బుధవారం ఆయన పరామర్శించారు. ముసలయ్య తల్లి సీతామహాలక్ష్మి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. నాయకులు పి.రాఘవరావు, భీమవరపు నాగిరెడ్డి, తంబాబత్తుల ఓంకారం, కలపాల వజ్రాలు, శ్రీకాంత్, మాదు రాఘవేంద్రరావు, భీమవరపు రమేష్ రెడ్డి, గాదంశెట్టి పరమేశ్వరరావు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం జీవితం యువతకు స్ఫూర్తినీయం



గన్నవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో బుధవారం మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కలాం చిత్రపటానికి గ్రంథాలయాధికారి కె.నాగరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా దేశానికి అబ్దుల్ కలాం ఎనలేని సేవలందించారని ఆయన వివరించారు. నిరుపేద కుటుంబంలో జన్మించి దేశం గర్వించే స్థాయికి ఎదిగిన ఆయన జీవితం యువతకు స్ఫూర్తినీయమన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది పీడీ లక్ష్మీ, పలువురు పాఠకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రామాంజనేయుల వ్యాఖ్యలు హేయం

కంకిపాడు: దళితులను దళారులంటూ ఎమ్మెల్యే రామాంజనేయులు వ్యాఖ్యలు చేయడం అత్యంత హేయమైన చర్య అని మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగుల మూడి రాజు విమర్శించారు. స్థానిక సంఘ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు దళితులను దళారులంటూ సంబోధించటం సిగ్గుచేటన్నారు. కలుషిత నీరు తాగి 24 మంది మృత్యువాత పడితే ప్రతిపక్షంపై విమర్శలు చేయాలని చూడడం విడ్డూరమన్నారు. తక్షణమే రామాంజనేయులు తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని, దళితులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

18 నుంచి చెకుముకి సంబరాలు

గన్నవరం రూరల్: విద్యార్థులలోని సృజనవెల్లడికి చెకుముకి సైన్స్ సంబరాలు దోహదం చేస్తాయని జనవిజ్ఞాన వేదిక జిల్లా సభ్యులు, చెకుముకి జిల్లా కన్వీనర్ షేక్ ఇమాం తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఈనెల 18వ తేదీ నుంచి చెకుముకి సైన్స్ సంబరాలు పాఠశాల స్థాయిలో ప్రారంభమవుతాయన్నారు. నవంబరు 1న మండల స్థాయి, నవంబరు 23న జిల్లా స్థాయి, డిసెంబరు 12, 13, 14వ తేదీల్లో రాష్ట్ర స్థాయి సైన్స్ సంబరాలు జరుగుతాయని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే 8, 9, 10 విద్యార్థులు పాల్గొనేందుకు అర్హులన్నారు. పాఠశాల హెచ్‌ఎంలు తమ పాఠశాలల్లో ఈ చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించడానికి సహాయపడాలని, వివరాలకు 77999 85786 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

గొల్లనపల్లి సమస్యలు పరిష్కరించాలని వినతి

గన్నవరం రూరల్: మండలంలోని గొల్లనపల్లిలో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలు పరిష్కరించాలని ఆ గ్రామ ఉప సర్పంచ్ యనమదల సుబ్బారావు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీకి బుధవారం వినతి పత్రాన్ని అందజేశారు. గన్నవరంలో కలెక్టర్‌ను కలిసి గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని.. తాగునీటి ట్యాంకు శిథిలావస్థకు చేరిందని.. శ్మశానవాటికకు వెళ్లే మార్గం అధ్వాన్నంగా ఉందని కలెక్టర్ డీకే బాలాజీకు వివరించారు. శ్మశానానికి వెళ్లే రహదారి నిర్మాణం వెంటనే చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

గన్నవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ హాజరై నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని యార్లగడ్డ తెలిపారు. నియోజకవర్గంలో భూసమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో గుడివాడ ఆర్డీవో జి.బాల సుబ్రహ్మణ్యం, ఏఎంసీ చైర్మన్ గూడవల్లి నరసయ్య, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం చిక్కవరంలో బుక్‌కీపర్‌గా పనిచేస్తున్న పీకా నరసమ్మ అవినీతి, అక్రమాలపై జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలకు సమత గ్రామైక్య సంఘం సభ్యులు ఫిర్యాదు చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని పలువురు అర్జీలను సమర్పించారు.



కలెక్టర్, ఎమ్మెల్యేకు అర్జీలు ఇస్తున్న ప్రజలు

వృద్ధురాలి అదృశ్యంపై కేసు

కంకిపాడు: వృద్ధురాలి అదృశ్యంపై స్థానిక పోలీసుస్టేషన్‌లో బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన వివరాల ప్రకారం.. తోట్లవల్లూరు మండలం బొడ్డపాడు గ్రామానికి చెందిన శీలం నిర్మల(70) ప్రొద్దుటూరులో ఉంటున్న కుమార్తె ఇంటికి వచ్చారు. ఈనెల 8న ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో కారు ధ్వంసం



కంకిపాడు: రోడ్డు ప్రమాదంలో కారు ధ్వంసమైన సంఘటన కంకిపాడు-గోసాల మధ్య విజయవాడ, మచిలీపట్నం జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. మచిలీపట్నం నుంచి విజయవాడ వైపు వెళుతున్న కారు ఎదురుగా వెళుతున్న లారీని ఢీకొట్టింది. దీంతో కారు ధ్వంసమైనట్లు స్థానికులు తెలిపారు. కారు నడుపుతున్న డ్రైవరు స్వల్పంగా గాయపడగా స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

అదనపు కట్నం కోసం వేదింపులు

కంకిపాడు: భార్యను అదనపు కట్నం కోసం వేదిస్తున్న భర్తపై కంకిపాడు పోలీసుస్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన వివరాల మేరకు.. ఈడుపుగల్లుకు చెందిన యువతిని కేసరపల్లికి చెందిన సాంబశివరావు 2017లో వివాహం చేసుకున్నారు. దురాలవాట్లకు గురైన సాంబశివరావు బాధితురాలిని మానసిక, శారీరకంగా వేదించడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

టపాసుల దుకాణాలకు నిబంధనలు తప్పనిసరి



నున్న మ్యాంగో మార్కెట్లో వ్యాపారులతో మాట్లాడుతున్న సుగుణ

నున్న(విజయవాడ రూరల్): దీపావళి పండుగ సందర్భంగా టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసుకునే వారు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని రూరల్ మండల తహసీల్దారు బి.సుగుణ వ్యాపారులకు సూచించారు. బుధవారం నున్న గ్రామంలోని మ్యాంగో మార్కెట్లో 10 దీపావళి టపాసుల దుకాణాల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేసినట్లు ఆ ప్రాంతాన్ని పరిశీలించిన తహసీల్దారు తెలియచేశారు. వ్యాపారులతో ఆమె మాట్లాడుతూ.. ప్రతి షాపు వద్ద అగ్నిప్రమాదాలు జరుగకుండా ఎక్విప్‌మెంటును ఏర్పాటు చేయాలన్నారు. ప్రత్యేకంగా పార్కింగ్ స్థలం ఉండాలన్నారు. నున్న పోలీసుస్టేషన్ ఎస్ఐ విమల, అగ్నిమాపక శాఖ అధికారులు పాల్గొన్నారు.

రైతులు ట్రాక్టర్‌లు ఏర్పాటు చేసుకోవాలి..

నున్న(విజయవాడ రూరల్): ఖరీఫ్ సీజన్లో రైతులు పండించిన ధాన్యం మిల్లర్లకు విక్రయించే విషయంలో రైతులు ట్రాక్టర్లు ఏర్పాటు చేసుకుంటే రవాణా సులువుగా ఉంటుందని మండల తహసీల్దారు బి.సుగుణ సూచించారు. బుధవారం నున్న రైతు సేవా కేంద్రంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ధాన్యం రైస్‌మిల్లులకు రవాణా చేసే విషయంలో రైతులే తమ ట్రాక్టర్లకు జీపీఎస్(గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్)ను ఏర్పాటు చేసుకుని రవాణా చేస్తే కిరాయిలు ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏవో కె.రఘురామ్, గ్రామంలోని పలువురు రైతులు పాల్గొన్నారు.

కమిషనర్ సారూ.. మాకు న్యాయం చేయండి

రామవరప్పాడు: రాంగ్ రూట్‌లో నిర్లక్ష్యంగా కారు నడుపుతూ ద్విచక్రవాహనంపై వెళుతున్న తమను ఢీకొట్టి.. తమపైనే ఎదురు కేసు పెట్టి వేదింపులకు గురి చేస్తున్నారని రామవరప్పాడుకు చెందిన దంపతులు బుధవారం సాక్షి ముందు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. రామవరప్పాడు సాయిబాబా ఆలయం సమీపంలో తమ్మల జోసఫ్ రవికిరణ్, తుమ్మల బిందు భార్యాభర్తలు. ఈనెల 8న ద్విచక్రవాహనంపై దంపతులు పనిపై భవానీపురం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో పున్నమి ఘాట్ సమీపంలో ఏపీ 16 బీఎస్ 9359 నంబరు గల కారు రాంగ్ రూట్‌లో వచ్చి తమ ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 5 నెలల గర్భిణీ అయిన బిందుకు రెండు చోట్ల కాలు విరిగింది. ఈనెల 10న శస్త్ర చికిత్స కూడా చేశారు. ప్రమాదంపై బాధితుడు రవికిరణ్ భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐ వేంకటేశ్వర రావుకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు. తమ ఫిర్యాదును స్వీకరించకుండా కూటమి నాయకుల ఒత్తిడితో తానే కారును ఢీకొట్టానని తమపై ఎదురు కేసు పెట్టారని రవికిరణ్ ఆవేదన వ్యక్తం చేశాడు. పోలీస్ కమిషనర్ ఈ ఘటనపై విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలని బాధితులు విలపిస్తున్నారు.



తమ ఫిర్యాదును చూపిస్తున్న బాధిత భార్యాభర్తలు

సృజనాత్మక ఆలోచనలు పెంపొందించుకోవాలి

పెనమలూరు: విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలు పెంపొందించుకోవాలని టెక్‌మహేంద్ర హెడ్ చల్లా వివేకానంద అన్నారు. కానూరు సిద్ధార్థ డీమ్డ్ టుబీ యూనివర్సిటీలో బుధవారం భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా ఇన్నోవేషన్ డే ను ఆయన ఘనంగా ప్రారంభించి ప్రసంగించారు. కాంగ్నిజెంట్ టెక్నాలజీస్ సీనియర్ మేనేజర్ జితేందర్‌సింగ్ మాట్లాడుతూ.. విద్యార్థులు పరిశ్రమలకు అనుగుణంగా ఆవిష్కరణలు చేయాలన్నారు. నేడు సాఫ్టువేర్‌లో అనేక ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఉపకులపతి ప్రొఫెసర్ పి.వెంకటేశ్వరరావు, ప్రో ఉపకులపతి డాక్టర్ ఏవీ రత్నప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థులు పరిశోధనలపై ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. యూనివర్సిటీలో ఇన్నోవేషన్ మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఇన్నోవేషన్ ఎక్స్‌పోలో దేశ వ్యాప్తంగా దాదాపు 390 మోడళ్లను విద్యార్థులు ప్రదర్శించారు. సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు ఎం.రాజయ్య, రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.రవిచంద్ర, డీన్‌లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఇన్నోవేషన్ ఎక్స్‌పోలో విద్యార్థులు ప్రదర్శించిన మోడళ్ల పరిశీలన

పోషకాహారం ప్రాధాన్యతను గుర్తించాలి

పెనమలూరు: పోషకాహారం ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని ఐసీడీఎస్ సీడీపీవో కె.బేబీసుకన్య అన్నారు. తాడిగడప మున్సిపాలటీ పరిధి పోరంకి సాలిపేటలో బుధవారం సామాజిక వేడుకలు అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహించారు. కార్యక్రమంలో సుకన్య మాట్లాడుతూ.. గర్భిణులు రక్తహీనత లేకుండా చూసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతం, చిన్నారులకు ఉయ్యాల, అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ విజిటర్ నిర్మలకుమారి, ఏఎన్‌ఎం సీత, జ్యోతి, అంగన్‌వాడీ, ఆశా వర్కర్స్, తల్లులు పాల్గొన్నారు. వణుకూరు అంగన్‌వాడీ కేంద్రంలో శిశువు, చిన్నపిల్లల ఆహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వంటల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఐసీడీఎస్ కార్యాలయానికి వాటర్‌కూలర్ వితరణ..

కంకిపాడు: ఐసీడీఎస్ కార్యాలయానికి కంకిపాడు సీహెచ్‌సీ మాజీ చైర్మన్ యలమంచిలి కిషోర్‌బాబు బుధవారం వాటర్ కూలర్‌ను వితరణగా అందించారు. ఈ సందర్భంగా సీడీపీవో బేబిసుకన్య మాట్లాడుతూ.. దాతల సహకారంతో వసతులు సమకూరుతున్నాయన్నారు. వసతులను సద్వినియోగం చేసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఎస్.అన్నామణి, రాఘవమ్మ, విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



గర్భిణులకు సీమంతం చేస్తున్న సీడీపీవో బేబీసుకన్య



వాటర్‌కూలర్ అందజేస్తున్న కిషోర్‌బాబు

వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ

కంకిపాడు: అయ్యప్ప మహా పడిపూజా మహోత్సవం బుధవారం రాత్రి వైభవంగా జరిగింది. మండలంలోని మంతెన గ్రామంలో అయ్యప్ప మాలధారి వీరంకి నాగు ఆధ్వర్యంలో గ్రామంలోని వెంకటదాసు ఆలయం వద్ద అయ్యప్ప పడి మండపాన్ని సిద్ధం చేశారు. మహాశివుడు, అయ్యప్ప, విఘ్నేశ్వరస్వామి, సుబ్రహ్మణ్యస్వామి, ఇతర దేవతామూర్తులను మండపంలో ప్రత్యేకంగా అలంకరించారు. గురుస్వాములు చిమటా ప్రసాద్, తాతా వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు, అయ్యప్ప స్వామికి అభిషేక మహోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గాయకులు ఆలపించిన భక్తిగీతాలు అందరినీ అలరించాయి. పూజా కార్యక్రమాల్లో అయ్యప్ప మాలధారులు, శివ, గోవింద మాలధారులు, స్థానికులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న అయ్యప్ప మాలధారులు